క్లుప్తంగా

24న ఏలూరులో దివ్యాంగుల క్రీడా పోటీలు

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా వారికి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 24న ఏలూరులో నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి.రాకడ మణి మంగళవారం మాట్లాడుతూ 24న ఉదయం 8 గంటల నుంచి ఏలూరు కలెక్టరేట్ ఎదురుగా ఇండోర్ స్టేడియంలో ఈ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ క్రీడల పోటీలపై ఆసక్తి కలిగిన ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు నేరుగా ఉదయం 8 గంటలకు ఏలూరు ఇండోర్ స్టేడియానికి రావాలని రాకడ మణి తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 4 డిజిటల్ తరగతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరు ఆధ్వర్యంలో ఏలూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఒక్కొక్క తరగతికి రూ. లక్ష చొప్పున వెచ్చించి అధునాతన డిజిటల్ తరగతులు ఏర్పాటు చేశామని రోటరీ 3020 జిల్లా గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావు తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ రోటరీ జిల్లా పరిధిలోని 86 క్లబ్‌ల అధికారికి పరిశీలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏలూరు రోటరీ క్లబ్‌ను పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా ఏలూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నలుగురు పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. ప్రేమాలయం వృద్ధాశ్రమానికి, బ్లైండ్ హోమ్‌కు నెలకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశామన్నారు. 40 బాలికల హాస్టళ్లలోని 1,200 మందికి పరుపులు అందించామన్నారు. మరో 1000 మంది మహిళలకు పారిశ్రామిక కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. జిల్లాలోని భోగాపురంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని దీని ద్వారా సమీపంలోని 10 గ్రామాల్లో ఉన్న దివ్యాంగులకు ఉపాధి లభిస్తుందన్నారు. గిరిజన ప్రాంతాల బాలికలకు కంప్యూటర్ విద్య అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఏలూరు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నేలపాటి రోహిత్, శానం ప్రసాదరావు, అసిస్టెంట్ జిల్లా గవర్నర్ పీ. శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవీన్‌కు డాక్టరేట్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాల జంతు శాస్త్ర విభాగంలో దశాబ్దాలకాలంగా అధ్యాపకులుగా పనిచేస్తున్న మరీదు నవీన్‌కుమార్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. కొల్లేరు నీటిలో, మట్టిలో కొరమేను చేపలో భారలోహాల కాలుష్య తీవ్రతపై, దాని పర్యవసానాలపై నవీన్‌కుమార్ చేసిన శాస్త్రీయ పరిశోధనలకుగాను ఆయనకు ఈ డాక్టరేట్ లభించింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ పీవీ కృష్ణ పర్యవేక్షణలో పరిశోధనా పత్రాన్ని నవీన్‌కుమార్ సమర్పించగా యూజీసీ గైడెలైన్స్ ప్రకారం దాన్ని ఆమోదించి ఆయనకు డాక్టరేట్ అవార్డును ప్రదానం చేశారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నవీన్‌కుమార్‌ను కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ప్రిన్సిపల్ కేపీ రామరాజు, వైస్ ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ వై.సతీష్ బాబు, ఐక్యూఏసీ కన్వీనర్ జీ.రాము, జీఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


ట్రాఫిక్ స్టేషన్ వద్ద బస్సు డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ వరప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో కార్పొరేటర్ కళాశాలల బస్సు డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, ఇష్టారాజ్యంగా డ్రైవింగ్ చేస్తే సహించేదిలేదని ఏలూరు ట్రాఫిక్ సీఐ కేవీఎస్ వరప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ ఇ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ట్రాఫిక్ స్టేషన్ వద్ద కళాశాల బస్సు డ్రైవర్లకు మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏలూరు నగరంలోని ప్రైవేటు కళాశాలల బస్సుల డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు శ్రీధర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు ఉన్నారు.

మహిళా కళాశాలలో వాలీబాల్ సెలెక్షన్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో బాలికల వాలీబాల్ పోటీలు, యూనివర్సిటీ టీమ్ సెలెక్షన్లను ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలోని 12 కళాశాలల నుంచి 140 మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఆర్ విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు వీవీ బాలకృష్ణారావు, కోశాధికారి సీహెచ్ జానకి రామయ్య, జాయింట్ సెక్రటరీ వల్లభనేని శ్రీకృష్ణ, అటానమస్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కే.హరిరామకృష్ణంరాజు, పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కేపీ రామరాజు, మహిళా కళాశాల ప్రిన్సిపల్ కే. శైలజ పాల్గొన్నారు.

వృద్ధులకు ఆసరాగా నిలిచిన పింఛన్


శనివారపుపేటలో వృద్ధురాలకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)


చొదిమెళ్లలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

- 6,508 మందికి ప్రతి నెల పింఛన్లు
- నేటికి రూ.63.58 కోట్లు పింఛన్ లబ్ధిదారులకు పంపిణీ

ఏలూరు రూరల్: వృద్ధులు, వికలాంగులు, వితంతువుల, ఒంటి మహిళలకు అండగా నిలిచి వారికి ఆర్థిక ఆసరాగా ప్రతి నెలా మొదటి రోజునే ప్రభుత్వం క్రమం తప్పకుండా పింఛన్ అందిస్తోంది. వృద్ధుల పోషణకు పింఛన్ ఎంతగానో ఉపకరిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేస్తున్న వైఎస్ఆర్ పింఛన్ కానుక పథకంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు భరోసా లభించింది. ఫలితంగా అనాథ ఆశ్రమాల వైపు అడుగులు వేసిన వృద్ధులు, నేడు ఇంటి వద్దనే పిల్లల ప్రేమ, అనురాగం మధ్య సంతోషంగా జీవిస్తున్నారు.

కోట్ల రూపాయల్లో పంపిణీ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏలూరు రూరల్ గ్రామాల పరిధిలో 6,508 మందికి పింఛన్లు మంజూరు చేసింది. గత ప్రభుత్వం హయాంలో కంటే 20 శాతం ఎక్కువ. గతంలో ఏడాదికి లేదా ఎన్నికల వేళల్లో కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి నెల పింఛన్ దరకాస్తులను వలంటీర్ల ద్వారా సేకరిస్తోంది. సచివాలయ ఉద్యోగుల ద్వారా పరిశీలన చేసి కొత్త పింఛన్లు మంజూరు చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.2 వేల పింఛన్ విడతల వారీగా రూ.3 వేలకు పెంచారు. గతంలో పింఛన్ కోసం లబ్ధిదారులు రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు పడేవారు. నేడు ప్రతినెలా 1వ తేదీన వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే లబ్ధిదారులు పింఛన్ అందుకుంటున్నారు. ఈ మార్పు లబ్ధిదారుల్లో మరింత ధైర్యం పెంచింది. 2019 నుంచి 2023 నవంబర్ నెలకు ప్రభుత్వం మొత్తంగా 6,508 మంది లబ్ధిదారులకు రూ. 63,58,08,750 ప్రభుత్వం పింఛన్ పథకంలో అందించింది.

గ్రామాల వారీగా పింఛన్లు

గ్రామం	లబ్ధిదారులు	నగదు మొత్తం (రూపాయల్లో)
చాటపర్రు	1,020	10.22,01,1500
పైడిచింతపాడు	388	3,81,42,000
ప్రత్తికోళ్లలంక	743	6,90,30500
కోటేశ్వరదుర్గాపురం	208	1,94,80250
కోమటిలంక	187	1,83,26250
శ్రీపర్రు	907	8,83,94250
పెదయాగనమిల్లి	111	1,16,39750
గుడివాకలంక	861	8,11,43000
జాలిపూడి	758	7,64,21250
మల్కాపురం	422	4,20,83000
మాదేపల్లి	903	8,89,47000

పింఛన్ పథకం జీవనాధారం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాక ముందు ప్రతి పింఛన్ కోసం ఎండలో, ఆరుబయట అరుగుల మీద గంటల తరబడి కూర్చోవాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రతినెల 1వ తేదీన ఉదయం 6 గంటలకే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ అందిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది పడకుండా సంతోషంగా జీవిస్తున్నాను. నాలాంటి వృద్ధులు, వికలాంగులకు ప్రతినెల వచ్చే పింఛన్ జీవనాధారం. నేడు వృద్ధులకు కుటుంబాల్లో ప్రేమ, గౌరవం పెరిగింది. – పులి కల్యాణరావు, ఇందిరాకాలనీ, వెంకన్నచెరువు

వలంటీర్లను విమర్శించడం తగదు



వృద్ధులను పోషించేందుకు పేద కుటుంబాలు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు పింఛన్ పథకం వృద్ధులకు అండగా ఉంది. ప్రభుత్వం ప్రతి నెల ఇస్తున్న పింఛను డబ్బులతో వృద్ధులు మందులు కొనుక్కుంటున్నారు. కొన్నిసార్లు కుటుంబం ఆర్థిక సమస్యలో ఉన్నప్పుడు పింఛన్ డబ్బులు ఇచ్చి ఆదుకుంటున్నారు. కొన్ని కుటుంబాలకు వృద్ధులే ఆధారమయ్యారు. పింఛన్‌దారులకు సేవలందిస్తున్న వలంటీర్లను విమర్శించడం తగదు. – సీహెచ్ రమాభారతి, వైఎస్సార్ కాలనీ

రూ. 80 లక్షల అభివృద్ధి పనులకు ఆమోదం


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్లనాని

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో డివిజన్ల వారీగా ఆయా ప్రాంతాల్లో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ ప్రణాళికతో పనిచేస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చెప్పారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం 12వ డివిజన్‌లో గతంలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్షలో ఏలూరు నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్లిన సందర్భంలో స్థానిక సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. 12వ డివిజన్‌లో సుమారు రూ. 80 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపామన్నారు. త్వరలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ, నగరపాలక సంస్థ అధికారులు ఉన్నారు.

విద్యార్థి కమలేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి


ఎఫ్ ఆర్‌డీఓ ఖాజావలీకి వినతి పత్రం అందించిన సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్): పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న భీమడోలు మండలం అర్జావారిగూడెంకు చెందిన దాసి వెంకటేశ్వరరావు(తంబి) కుమారుడు కమలేష్ మృతిపై సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. దీనిపై మంగళవారం ఏలూరు ఆర్డీవో ఖాజావలీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 20న రాత్రి కమలేష్ ఉరి వేసుకుని చనిపోయినట్లు పాఠశాల సిబ్బంది చెబుతున్నారన్నారు. కమలేష్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం, అతని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పెదవేగి గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రతి మూడు నెలలకొకసారి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. స్కూలు ఆవరణలో శుభ్రత, రాత్రి వేళలో పాఠశాల, కళాశాల ఆవరణలో విద్యుత్ దీపాలు, చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని ప్రభుత్వానికి సంతోష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు రైతాంగ సమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. అనంతరం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావం వల్ల పంటలు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. పంటల బీమా పథకం వర్తింప జేయాలని కోరారు. కేంద్రం మోదీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27,28 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు గంటా పాపారావు, గుండపనేని సురేష్ పాల్గొన్నారు.

పేదల సంతోషమే లక్ష్యంగా పథకాల అమలు


కలకుర్రులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- కలకుర్రులో ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం

ఏలూరు రూరల్: పేదల సంతోషమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఆయన ఏలూరు రూరల్ మండలం కలకుర్రులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలను మెచ్చి రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయనున్నారని అన్నారు. కులం,మతం, వర్గం భేదం లేకుండా అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. 2019 ఎన్నికల్లో కొల్లేరు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సర్పంచ్ బలే నాగప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. పర్యటనలో భాగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేసారు. పలువురు మహిళలకు జగనన్న కాలనీ ఇళ్ల స్థల పట్టాలు అందజేసారు. ఉపసర్పంచ్ ముంగర బాలఏసు, ఎంపీటీసీ బలే స్వాతితో పాటు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, నాయకులు పీవీరావు, తేరా ఆనంద్, మండల కొండలరావు, ముంగర సంజీవ్‌కుమార్, బొల్లిముంత రాముతో పాటు తహసీల్దార్ జె శ్రీనివాసరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు


మాట్లాడుతున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు చిత్రంలో కార్పొరేటర్లు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలంటే సంక్షేమ పాలన కావాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. ఏలూరు 15 డివజన్ గాంధీనగర్ కాలనీ సచివాలయం -41 పరిధిలో, పోణంగి సచివాలయం-82 పరిధిలో రెండు చోట్ల మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా జగనన్నే మా నమ్మకం- వార్డుకు పోదాం కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించడంతో పాటు డివిజన్‌లో సంక్షేమ పథకాలతో కూడిన బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదవర్గాల పిల్లలకు అత్యుత్తమ స్థాయి విద్యను చేరువ చేసేందుకు నాడు-నేడులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చివేసి అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తంగెళ్ల రాము, క్లస్టర్-1 మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి,ఏలూరు జిల్లా జేసీఎస్ కన్వీనర్ వైఎన్‌వీ శివరావు, ఏలూరు నియోజకవర్గం జేసీఎస్ క్లస్టర్-1 కన్వీనర్ మెటమర్రి సదానందం, క్లస్టర్-1 ఉపాధ్యక్షుడు విజయ్, జయరామ్ రెడ్డి, రంగ ముత్యాలు, పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ఏలూరు (టూటౌన్): ఆప్కాస్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నా, వంటావార్పు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, ఏలూరు నగర అధ్యక్షుడు లావేటి కృష్ణారావు, వినుకొండ రమేష్,జి.ఏసునాథ్, నూజివీడు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, జయలక్ష్మి, జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, లక్ష్మణ్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల మెరుగుకు సంక్షేమ పాలన దోహదం


ఏలూరు 18వ డివిజన్‌లో గడపకుగడపకు 125వ రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

- ఏలూరులో 125వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం
- 18వ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆళ్ల నానికి నీరాజనం

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగయ్యేందుకు నవరత్నాల పథకాల పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు 18వ డివిజన్ వంగాయగూడెంలో 125వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. డివిజన్ కార్పొరేటర్ ఇనపనూరి కేదారేశ్వరి, పార్టీ నాయకులు ఇనపనూరి జగదీష్ ఆధ్వర్యంలో 125 కిలోల భారీ కేక్‌ను ఏర్పాటు చేశారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని చిన్నారులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. తొలుత వంగాయగూడెం సెంటరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ఆళ్ల నాని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డివిజన్‌లో పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సోషల్ ఇంజనీరింగ్ చేస్తూ మానవవనరుల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ, ప్రణాళికతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఎఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ ఉన్నారు.

సేవకు ప్రతిరూపం నర్సింగ్ వృత్తి


నైటింగేల్ పురస్కార గ్రహీత ఝాన్సీరాణిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ప్రజలకు అంకితభావంతో వృత్తిపట్ల నిబద్ధతతో విశిష్టమైన సేవలు అందించే నర్సులకు ప్రతిష్టాత్మక ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాన్ని అందిస్తారని అటువంటి ఉన్నత పురస్కారమే అందుకోవడం అభినందనీయమని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. నర్సుగా పని చేస్తోన్న మిరియాల ఝాన్సీరాణి ఫ్లోరెన్స్ నైటింగేల్ పురస్కారాన్ని అందుకున్నారు.ఈ నేపథ్యంలో ఆమె ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాని మర్యాదపూర్వకంగా కలిసి తనకు అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఆయన సంతోషం వ్యక్తం చేయడంతో పాటు నర్సు ఝాన్సీరాణిని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని సూచించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయము, ఏలూరు
బహిరంగ వేలం ప్రకటన
ఆర్.ఓ.సి.నెం.64/2023 తేది.20.11.2023
[illegible] ది.28.11.2023వ తేదిన ఉదయం గం.11.00లకు [illegible] (Scrap) [illegible] 5 గంటల లోపు [illegible] (Scrap) [illegible] ది.28.11.2023 తేదిన ఉదయం 11.00 గంటలకు Four Members Committee [illegible]
[illegible] వ్యవసాయ మార్కెట్ కమిటీ. ఏలూరు
[illegible] వ్యవసాయ మార్కెట్ కమిటీ. ఏలూరు

కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలని వినతి

ఏలూరు (టూటౌన్): కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం కొల్లేరు చుట్టు పక్కల ఫ్యాక్టరీల నుంచి వస్తున్న మురుగు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

మానవతా దృక్పథంతో కారుణ్య నియామకం

ఏలూరు(మెట్రో): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మానవత దృక్పథంతో కారుణ్య నియామకాన్ని కల్పించడంతో నిరుపేద కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వేల్పూరు గ్రామ పంచాయతీలో నీలపు రాంబాబు 30 ఏళ్ల పాటు స్వీపరుగా సేవలందించారు. సర్వీసులో ఉండగానే 2014లో మృతి చెందారు. రాంబాబుకు భార్య, ఆరుగురు పిల్లలు ఉన్నారు. రాంబాబు మరణానంతరం కారుణ్య నియామకానికి రాంబాబు కుటుంబసభ్యులు నిర్దేశిత గడువులోపు దరఖాస్తు ఇవ్వకపోవడంతో అప్పటి డీపీవో కార్యాలయం తిరస్కరించింది. ఈ నేపథ్యంలో 2019లో జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన తూతిక శ్రీనివాస విశ్వనాథ్ దృష్టికి రాంబాబు కుటుంబ సభ్యులు కారుణ్య నియామకం విషయాన్ని తీసుకువెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి ప్రతిపాదనలను 2019 ఉన్నతాధికారులకు పంపించారు. దీనిపై స్పందించిన పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ ప్రభుత్వానికి కారుణ్య నియామకంపై నివేదికను పంపారు. దీని ఆధారంగా ప్రభుత్వం, రాంబాబు కుమారుడు కిరణ్‌బాబుకు ఉద్యోగ అవకాశం కల్పిస్తూ జీఓ 773ను ఈ నెల 9న విడుదల చేసింది. ఈ సందర్భంగా డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ స్పందిస్తూ పేద కుటుంబానికి అండగా నిలిచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

